ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 25 ఆగస్టు 2025 | 5









గణపయ్యలు..సిద్ధమయ్యా!

ఊరూవాడా జరిగే పండుగ ఏదంటే టక్కున చెప్పేయవచ్చు.. వినాయక చవితి అని.. ఎందుకంటే ఏ వీధిలో చూసినా గణపయ్యలు దర్శనమిస్తారు.. ఒక్కో వీధిలో చూస్తే పోటాపోటీగా మూడు నాలుగు చోట్ల ఏర్పాటు చేస్తారు.. 9 రోజులు గణపతిని పూజిస్తారు.. బుధవారం వినాయక చవితి సందర్భంగా గణపతులు ముస్తాబవుతున్నారు.. ఎక్కడికక్కడ గణపయ్యలను సిద్ధం చేస్తున్నారు.. ఏడాదంతా కష్టపడి తయారుచేసిన విగ్రహాలకు తుదిరూపు ఇస్తున్నారు.. మరో పక్కన భారీగా విక్రయాలు చేస్తున్నారు.. 3 అడుగుల నుంచి 20 అడుగుల వరకూ విగ్రహాలు అమ్మకానికి సిద్ధంగా ఉంచారు.. పలు చోట్ల రెడీమేడ్‌గా విగ్రహాలను ఉంచి ఎత్తు ఆధారంగా రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు విక్రయిస్తున్నారు. చవితి నిర్వాహకులు విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు.

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వాయిదా

- తదుపరి తేదీ త్వరలో వెల్లడిస్తాం
- కాకినాడ జిల్లా డీఈవో రమేష్

గొల్లప్రోలురూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నియామక ప్రక్రియకు సంబంధించి మెరిట్ లిస్ట్‌లో ఉన్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా పడింది. ఇది సోమవారం జరగాల్సి ఉండగా వాయిదా వేశామని, తదు పరి తేదీని త్వరలో వెల్లడిస్తామని కాకినాడ జిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు.

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఈపరిశీలన జరగాల్సి ఉంది. దీని నిమిత్తం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి మెరిట్ జాబితాలోఉన్న 1241 అభ్యర్థులు పరిశీలనకు హాజరుకావాలని ఇప్పటికే సమాచారం ఇచ్చారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం ఎంఈవోలు, గెజిటెడ్ హెచ్‌ఎం, డిప్యూటీ తహసీల్దారు, ఎంఐఎస్ ఆపరేటర్‌లతో కూడిన 25 తనిఖీ బృందాలను ఏర్పాటుచేశారు. దీనికోసం ఆదివారం సాయంత్రం బందోబస్తు ఏర్పాట్లను పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ పరిశీలించారు. కానీ, అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా పడింది. ఈ మేరకు ఆదివారం రాత్రి కాకినాడ డీఈవో ప్రకటన విడుదల చేశారు. పరిశీలన తేదీని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.



బార్‌మంటున్నారు!

బార్‌లకు ముందుకురాని వ్యాపారులు

- నష్టపోతామని వెనుకంజ
- ఇక మిగిలింది రెండు రోజులే
- 46 బార్లకు 11 ఎన్‌రోల్‌మెంట్లు
- దరఖాస్తులకు ఎక్సయిజ్ శాఖ పట్టు
- మద్యం దరఖాస్తుదారులకు మెసేజ్‌లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రండి బాబు.. రండి.. దరఖాస్తు చేయండి.. మంచి తరుణం మించిన రాదు..అంటూ గతంలో ప్రైవేటు మద్యం షాపులకు దరఖాస్తు చేసిన వాళ్లందరికీ ఎక్సయిజ్ అధికారులు వేలల్లో మెసేజ్‌లు పంపుతున్నారు.

ఇవీ వ్యాపారుల లెక్కలు

రాజమహేంద్రవరంలో ఒక బార్‌కు దరఖాస్తు చేయాలంటే ఖర్చు ఇలా ఉంటుందని వ్యాపారులు లెక్కలు వేసుకుంటు న్నారు..ఒక్కో షాపునకు 4 దరఖాస్తులు తప్పనిసరి.. మూడు దరఖాస్తులు వచ్చినా లాటరీ ఉండదు. ఆ లెక్కన సిండికేట్‌గా 4 షాపులకు దరఖాస్తు చేయాలి.అంటే ఫీజు రూ.20.40 లక్షలు, లైసెన్స్ రుసుం ఏడాదికి రూ.55 లక్షలు, ఇష్యూ ప్రైస్‌పై 15 శాతం అదనంగా అదనపు రిటైల్ ఎక్సయిజ్ టాక్స్ (ఏఆర్‌ఈటీ) సుమారు రూ.54 లక్షలు, నెలకు బార్ అద్దె రూ.1.25 లక్షలు, కరెంటు బిల్లు రూ.30 వేలు, రవాణా రూ.30 వేలు, జీతాలు రూ.1.50 లక్షలు, సివిల్ పోలీ సులకు నెలకు రూ.15 వేలు, ఎక్సయిజ్ వాళ్లకు రూ.50 వేలు..ఇలా మొత్తం కలిపి సుమారు రూ.1.80 కోట్లు ఏడాదికి వెచ్చించాల్సి ఉంటుందని వ్యాపారులు లెక్కలు వేసి చూపిస్తున్నారు. ఇంత ఖర్చు చేసి తాము నష్టపోకుండా ఉండాలంటే రోజుకు కనీస అమ్మకం రూ.3 లక్షలు ఉండాలని, అలా ఉండాలంటే క్వార్టరుపై కనీసం రూ.50 అదనంగా అమ్మినా కష్టమేనని, ప్రైవేటు మద్యం షాపులకు పర్మిట్ రూమ్‌లు ఉండగా అంత సొమ్ము అదనంగా చెల్లించి బార్‌లకు ఎవరు వస్తారని అంటున్నారు. పక్క రాష్ట్ర మైన తెలంగాణలో దరఖాస్తు ఫీజు రూ.1 లక్ష మాత్ర మేనని ఉదాహరణ చూపెడుతున్నారు.

దాబాల వద్దకు వెళ్లి దరఖాస్తు చేయమని వేడుకుంటున్నారు. అయితే కొత్త బార్ పాలసీకి సంబంధించి వ్యాపారులు ముఖం చాటేస్తున్నారు.. ఎక్సైజ్ అధికా రులు మాత్రం దరఖాస్తులు పెరిగేలా చర్యలు చేపడుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 46 బార్‌లకు నోటి ఫికేషన్ విడుదల చేయగా ఇప్పటి వరకూ కేవలం 11 ఎన్‌రోల్‌మెంట్లు మాత్రమే జరిగాయి.అయినా ఒక్కో బార్‌కి 10 దరఖాస్తులు వస్తాయని ఎక్సయిజ్ అధికారులు ధీమాగా ఉన్నారు. ఈ నెల 26 (మంగళవారం) దరఖాస్తు గడువు ముగుస్తుంది. ఇంకా మిగి లింది రెండు రోజులే..అయినా ఎన్‌రోల్‌మెంట్ చూస్తేనే నీరసంగా ఉంది. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 1 నుంచి బార్‌లు ఉంటాయా.. అనే సందిగ్ధం ఫుల్‌గా ఉంది.

బార్లు ఫుల్.. ఎన్‌రోల్‌మెంట్ నిల్

కొత్త బార్‌లకు సంబంధించి ఎన్‌రోల్‌మెంట్ నీరసంగా నడుస్తోంది. బార్‌ల లాటరీలో పాల్గొనాలంటే తొలుతగా ఉచితంగా ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాలి. తర్వాత ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలు చెల్లిస్తే ప్రక్రియ మొదలవుతుంది. అనంతరం రూ.5 లక్షలు దరఖాస్తు ఫీజు చెల్లించిన వారికి లాటరీలో పాల్గొనే అవకాశం దక్కుతుంది. అయితే ఉచితమైనప్పటికీ ఎన్‌రోల్‌మెంట్ అత్యంత నీరసంగానే సాగుతోంది. ఇంకా 2 రోజులే సమయం ఉన్నా కనీసం ఒక్క దరఖాస్తు సమర్పించలేదు.ఈ నెల 23న సాయంత్రం సమయానికి డా.బీఆర్ అంబేడ్కర్ కోన సీమ జిల్లాకు 9 బార్‌లు కేటాయించగా ఎన్‌రోల్‌మెంట్లు 4 జరిగాయి. ఇద్దరు మాత్రమే రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించారు.తూర్పు గోదావరి జిల్లాలో 22 షాపులకు మూడు ఎన్‌రోల్‌మెంట్లు జరగ్గా రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించలేదు. కాకినాడ జిల్లాకు సంబంధించి 15 బార్‌లకు ఐదుగురు మాత్రమే రిజిస్టరు అయ్యారు. ఒక్కో షాపునకు రూ.5.10 లక్షల చొప్పున దరఖాస్తు ఫీజును చెల్లించి 4 దరఖాస్తులు సమర్పించాలని తొలుత ప్రభుత్వం నిబంధన విధిం చినా వ్యాపారుల విన్నపాన్ని పరిగణనలోకి తీసుకొని దానిని సడలించింది. లాటరీలో షాపు దక్కించుకొన్న దరఖాస్తు మినహా మిగతా వారికి ఆ సొమ్ములు తిరిగి చేస్తామని ఎక్సైజ్ కమిషనర్ ప్రకటించారు. అయినా ఎన్‌రోల్‌మెంట్ మాత్రం నీరసంగానే సాగుతోంది. ఎక్సయిజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ శనివారం జిల్లాకు రావడంతో ఆయనతో సమావేశమై ఇబ్బందులను వివరించవచ్చని బార్ వ్యాపారులు ఆశించినా ఫలించలేదు.

నిబంధనలు మార్చాలి..


బార్ పాలసీలో మార్పులు చేయకపోతే నెలకు కనీసం రూ.10 లక్షల వరకూ నష్టం భరించాల్సి ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.పక్క రాష్ట్రంలోని హైదరాబాద్, సికింద్రాబాద్ మెట్రో సిటీల్లో సైతం రూ.40 లక్షల వార్షిక ఫీజు ఉండగా 22 శాతం మార్జిన్ సదుపాయం ఉంది.అయినప్పటికీ అక్కడా నష్టాలు భరిస్తున్నారు.బార్ ఏర్పాటుకు ఫర్నిచర్, సామగ్రి వంటి వాటికి లక్షల్లో పెట్టుబడి పెట్టా లి. అందువల్ల వార్షిక లైసెన్సు ఫీజులో ఎంతో కొంత పెంపుదల చేసి అప్పటికే ఉన్న బార్‌లను కొనసాగిస్తారు.ఇదే విధానం తెలంగాణలో ఉన్నా నష్టాలు వస్తున్నాయి. ఏపీలో ఇప్పుడు మూడేళ్లలో లైసెన్స్ అంటున్నారు. తర్వాత మళ్లీ లాటరీ అంటే.. తమకు షాపు రాకపోతే లక్షల రూపాయల సామగ్రి, ఫర్నీచర్ ఏం చేసుకోవాలని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ఆ నిబంధన మార్చాల ని డిమాండ్ చేస్తున్నారు.



పుష్కర ఏర్పాట్లపై దృష్టి పెట్టండి

రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ సమీక్ష

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గోదావరికి 2027లో జరిగే పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని విస్తృత ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ఆదేశించారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో ఆదివారం రాత్రి కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి, కార్పొరేషన్ అధికారులతో సమీక్షించారు. పుష్కరాలకు వచ్చే యాత్రికులకు ఇబ్బందిలేకుండా సౌకర్యాలు చేపట్టాలన్నారు. పీపీపీ విధానంలో రాజమహేంద్రవరంలో హోటళ్లు, రెస్టారెంట్లు సంబంధిత సేవలకు ప్రైవేట్ భాగస్వామ్యాలు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. రుడా పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రుడా మాస్టర్ ప్లాన్ 3,156 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో రూపొందించాల్సి ఉండగా ప్రస్తుతం 1,005 చదరపు కిలోమీటర్లతో మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ సిద్ధంగా ఉన్నట్టు అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. మిగిలిన ప్రాంతాలను అనుసంధానం చేస్తూ సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు.మాస్టర్ ప్లాన్‌పై ఉన్న అభ్యంతరాలు నోటిపై చేయాలన్నారు. రుడా పరిధిలో పంచాయతీలు, మునిసిపాలిటీల పరిధిలో మౌలిక వసతులపై దృష్టి సారించాలని సూచించారు. రుడా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ భూములను గుర్తించి ల్యాండ్ బ్యాంక్‌లను సిద్ధం చేసుకోవాలన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ మంత్రి సూచనల మేరకు రుడా పరిధిలో మౌలిక వసతులపై దృష్టి పెడతామన్నారు. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్), బిల్డింగ్ పెనాల్టీ స్కీమ్(బీపీఎస్)ద్వారా వచ్చే నిధులను రహదారులు, మురుగు కాలువలు వంటి పనులకు వినియోగిస్తామన్నారు.సమీక్షలో రుడా వైస్ చైర్మన్, జేసీ ఎస్ చిన్నరాముడు, సెక్రటరీ ఎంవీఆర్ సాయిబాబు, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ జీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.





కొత్త స్మార్ట్ కార్డులొస్తున్నాయ్.. / మంత్రి దుర్గేష్

నిడదవోలు, ఆగస్టు 24 (ఆం ధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తారని మంత్రి కందుల దుర్గేష్ తెలి పారు. మంత్రి క్యాంపు కార్యాల యంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాకు సంబంధించి 5,59,203 స్మార్ట్ రేషన్ కార్డులు తహశీల్దార్ల కార్యాలయాలకు చేరుకున్నాయన్నారు. పాత రేషన్ కార్డుల స్థానంలో వీటిని సచివాలయ సిబ్బంది ఇంటి వద్దనే అందజేస్తారన్నారు. సెప్టెంబరు 1 నుంచి రేషన్ షాపుల వద్ద కూడా అందజేస్తారని చెప్పారు.కార్డులకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. స్మార్ట్ కార్డులు క్యూఆర్ కోడ్‌తో ఉంటాయన్నారు. నిడదవోలులోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాలు లో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు.దివ్యాంగుల పెన్షన్ల తొలగింపులో అర్హులెవరూ ఆందోళన చెందవద్దని ఒక వేళ పొరపాటున అర్హులైన వారెవరికైనా పెన్షన్ ఆగిపోతే తిరి గిచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ,జడ్పీటీసీ కొయ్యే సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



గోదారి తగ్గింది..

ధవళేశ్వరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద వినాయక చవితికి వీధుల్లోకి వస్తుందనేది నానుడి.. ఈ ఏడాది కూడా అలాగే ఉంటుందని అంతా అనుకున్నారు. అయితే గత ఐదు రోజులుగా ఉరకలెత్తుతూ ఉధృతంగా ప్రవహించిన గోదావరి ఎట్టకేలకు తగ్గింది.. క్రమంగా సాధారణస్థాయికి చేరుకుంటుంది. ఎగువున వరద తగ్గుముఖం పట్టడంతో ధవళేశ్వరం వచ్చి చేరే వరద నీరు తగ్గింది. దీంతో పూర్తిగా ఎత్తివేసిన కాటన్ బ్యారేజ్ గేట్లను కిందకు దించి నీటి విడుదలను నియంత్రిస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం ఆర్మ్‌లోని మొత్తం గేట్లను 2 మీటర్ల మేర, మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌లోని మొత్తం గేట్లను 1.5 మీటర్లు మేర పైకి ఎత్తి 4,75,331 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 8.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాలకు తూర్పుడెల్టాకు 4600 క్యూసెక్కులు, సెంట్రల్ డెల్టాకు 2500 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 7000 క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.

తడిచెత్త.. పొడిచెత్త వేరు చేయలేరా?

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ నిర్వహణపై కలెక్టర్ ఆగ్రహం

ఏఈ గైర్హాజరుపై షోకాజ్ నోటీస్



సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ వద్ద అధికారులను ప్రశ్నిస్తున్న కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు చెందిన సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్లాంట్ పనితీరుపై కలెక్టర్, కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం పేపరు మిల్లు ఎదురుగా లూథర్‌గిరి వెనుక ప్రాంతంలో ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాంట్‌లో వ్యర్థాల సేకరణ, శుద్ధి, రీసైక్లింగ్ , కంపోస్టింగ్ పనుల తీరు పరిశీలించారు. హెల్త్ అధికారుల నుంచి ప్రాసెస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నగరంలో రోజుకు 160 టన్నుల చెత్త ఉత్పన్నం అవుతున్నా తడి చెత్త, పొడిచెత్త వేరు చేసే ప్రక్రియ సక్రమంగా జరగకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఏఈ గైర్హాజరు కావడంపై తీవ్రంగా స్పందించి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఏ స్థాయి అధికారి అయినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆమె వెంట అదనపు కమిషనర్ పీవీ.రామలింగేశ్వర్,డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఈఈ రీటా, డీఈ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆ నలుగురు.. కానిస్టేబుళ్లు!

రాజమహేంద్రవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పట్టుదల ఉంటే కానిది లేదు.. సాధించాలనే తపన ఉంటే ఆపేదెవరు.. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ.. హోంగార్డులు కానిస్టేబుళ్లుగా మారడం అరుదు.. జిల్లాలో హోంగార్డులుగా విధుల్లో ఉన్న పీవీ.వెంకట సురేశ్, కె.సతీశ్, కె.శ్రీను, వై.భీమరాజు సివిల్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు.ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు విడుదల కావడంతో ఎస్పీ నరసింహ కిశోర్ ఆదివారం వారిని పిలిచి తన కార్యాలయంలో శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. పోలీసు శాఖపై ఉన్న అవగాహన, అనుభవంతో మరింత ఉన్నతంగా సేవలందించాలని సూచించారు. క్రమశిక్షణ, నిజాయితీతో పని చేసి శాఖకు మరింత మంచి పేరు తీసుకురావడంలో భాగస్వామ్యం కావాలన్నారు. నిబద్ధతతో పని చేసి ప్రజలకు సమర్థవంతమైన సేవలందించాలన్నారు.

భూ కబ్జాదారులు, రౌడీ షీటర్లను ఉపేక్షించవద్దు

నేర సమీక్షలో ఎస్పీ నరసింహ కిశోర్



జిల్లా స్థాయి నేర సమీక్షలో ఎస్పీ నరసింహ కిశోర్, ఇతర అధికారులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): భూ కబ్జాదారులు, రౌడీ షీటర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశించారు. అలాంటి వారిపై పీడీ యాక్టు ప్రయోగించాలని, అవసరమైతే జిల్లా బహిష్కరణ చేయాలని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన చట్టాలకు లోబడి 60, 90 రోజుల్లో పు చార్జిషీట్లు దాఖలు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. సాంకేతికతను ఉపయోగిం చి పెండింగ్ కేసుల్లో పురోగతి సాధించాలని చెప్పారు.ప్రతి కేసు వివరాలు సీసీటీఎన్ఎస్‌లో డిజిటలైజేషన్ చేయాలన్నారు. గణేశ్ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పని చేయాలన్నారు. పెండింగ్ ఎన్‌బీడబ్ల్యులను అమలు పరచాలని స్పష్టం చేశారు. అనంతరం వినాయక ఉత్సవాలకు సంబంధించి పాటించాల్సిన విధి విధానాల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు మురళీకృష్ణ, సుబ్బరాజు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడికి రథోత్సవం

అన్నవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ఆదివారం ఆర్జితసేవయిన రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 10గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తోడ్కొనివచ్చి వివిధ సుగంధభరిత పుష్పాలతో తీర్చిదిద్దిన టేకురథంపై ఆశీనులు గావించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తూర్పురాజగోపురం చుట్టూ భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించి అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.


రథంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

డొక్కా సీతమ్మ జీవిత చరిత్రపై...

లంకలగన్నవరంలో డాక్యుమెంటరీ చిత్రీకరణ


లంకలగన్నవరం కోడేరు రేవు వద్ద ఓ సన్నివేశం చిత్రీకరణ

పి.గన్నవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అపర అన్నపూర్ణగా ప్రసిద్ధి గాంచిన డొక్కా సీతమ్మ జీవి త చరిత్రను ఇప్పటికే వివిధ రూపాల్లో తెరకెక్కించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు పలు తరగతుల పాఠ్య పుస్తకాల్లో ప్రచురించారు. తాజాగా గౌరి ప్రసాద్ మీడియా బ్లాక్అండ్‌వైట్ మూవీ మార్క్ సంస్థ అన్నపూర్ణతల్లి బువ్వమ్మ పేరుతో డాక్యుమెంటరీని చిత్రీకరిస్తున్నారు. డైరెక్టర్ సురేష్ లంకలపల్లి నూతన నటీనటులతో పలు దృశ్యాలను ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలోని లంకలగన్న వరంలో గోదావరి తీర ప్రాంతంలో చిత్రీకరించారు. దర్శకుడు సురేష్ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ అడిగినవారికి లేదనకుండా అన్నం వండి వడ్డించేవారని.. ఆమె జీవిత విశేషాలు, అపురూప ఘట్టాలను తెరకెక్కిస్తున్నామన్నారు. 2రోజులు పాటు లంకలగన్నవరంలో డొక్కా సీతమ్మ నివాసం, గోదావరి నదిపరివాహక ప్రాంతాలతో పాటు పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం ఆయో ధ్యలంకలో పలు సన్నివేశాలను చిత్రీకరిస్తామని చెప్పారు. ఈ డాక్యుమెంటరీకి నిర్మాతగా సీరాజ్, ఖాదర్ వ్యవహరించగా సింహరాశి డైరెక్టర్ సముద్ర, షిలిక లేనౌజా, ఆదిల్, రమేష్, కుసుమ తదితర నూతన నటులు నటిస్తున్నారని.. సంగీతం సాకేత్‌వేణి అందించగా ఆర్య సాయి కృష్ణ కెమెరామెన్‌గా పనిచేస్తున్నారని తెలిపారు. డాక్యుమెంటరీని అక్టోబర్‌లో విడుదల చేస్తామని ఎగ్జిక్యూటివ్ మేనేజర్ పి.శ్రీనివాస్ స్పష్టం చేశారు.

పెద్దది.. బాగున్నది!

ఆకట్టుకున్న సీతాకోకచిలుక


పెద్ద సైజులో ఉన్న సీతాకోక చిలుకను ఫొటో తీసుకుంటున్న ప్రజలు



వై.రామవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సీతాకోకచిలుకలు సహజంగానే అందంగా కనిపిస్తాయి. అల్లూరి జిల్లా వై.రామవరం- యార్లగడ్డ గ్రామాల మధ్య రహదారి పక్కన చెట్టు ఆకుల మధ్య ఉన్న కాండానికి పెద్ద సైజు సీతాకోక చిలుక వేలాడుతూ చూపరుల దృష్టి ని ఆకర్షించింది. దీని రెక్కల వెడల్పు అటు నుంచి ఇటు 8 అంగుళాలు ఉంది.

ఇంటర్నేషనల్ గ్రాండ్ ప్రిక్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు న్యాయనిర్ణేతగా శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

అమలాపురం టౌన్ ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పూణేలో ఈనెల 26 నుంచి 31వరకు జరిగే ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ గ్రాండ్ ప్రిక్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు కోనసీమ జిల్లా అమలాపురం శివారు కొంకాపల్లికి చెందిన పాయసం శ్రీనివాసరావును న్యాయనిర్ణేతగా నియమిస్తూ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఆదివారం నియామక ఉత్తర్వులను అందుకున్నారు. మరోసారి న్యాయనిర్ణేతగా నియామక పత్రాలను అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ హిమంత బిశ్వాశర్మ, ప్రధాన కార్యదర్శి సంజయ్ మిశ్రాల నుంచి అందుకున్నారు. శ్రీనివాసరావు నల్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటికే ఆయన థామస్ ఊబర్‌కప్, వరల్డ్ స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్, ఖేలో ఇండియా, ఆల్‌ఇండియా ర్యాంకింగ్ టోర్నమెంట్లతో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ప్రపంచస్థాయిలో క్రీడాకారుల ఎదుగుదలకు ఎంతో ముఖ్యమైన ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ గ్రాండ్ ప్రిక్స్ వంటి ప్రతిష్ఠాత్మకమైన టోర్నమెంట్‌కు ఎంపిక చేయడం పట్ల బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి అంకమ్మచౌదరి, ఉమ్మడి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కొత్తపల్లి బాబు, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, డీఎస్డీవో పీఎస్‌సురేష్‌కుమార్, కోనసీమ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు మెట్ల రమణబాబు, అల్లాడ శరత్‌బాబు పలువురు అభినందించారు.

కారు, బస్సు ఢీ : లారీ క్లీనర్ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న అన్నవరం ఎస్ఐ

శంఖవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి 16వ నెంబరు జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోతే సూరిబాబు (42) మృతిచెందాడు. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన సూరిబాబు లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం కత్తిపూడి 16వ నెంబరు జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా రాజమహేంద్రవరం వైపు నుంచి తుని వైపు వెళ్తున్న కారు, బస్సు వెంటవెంటనే ఢీకొనడంతో అక్కడికక్కడే క్లీనర్ మృతి చెందాడు. అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టాటా ఏస్ ట్రక్కు ఢీకొని యువకుడి మృతి


మృతిచెందిన నరేష్

కొవ్వూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం సాగిపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కొవ్వూరు మండలం తోగుమ్మి గ్రామానికి చెందిన యువకుడు మృతిచెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. కొవ్వూరు మండలం తోగుమ్మి గ్రామానికి చెందిన ముప్పిడి నరేష్ (26) గుడ్డిగూడెంలో ఉన్న అక్క నాగలక్ష్మిని, ఆరుగొలను బాలాతల్లి భవానిని చూడడానికి ఇద్దరూ కలిసి బైక్‌పై బయలుదేరారు. గోపాలపురం మండలం సాగిపాడు శివారున టాటా ఏస్ ట్రక్కు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నరేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. రాపాక బాలాకుమార్ కాలుకు తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. దీంతో తోగుమ్మిలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఐషర్ వ్యాన్ ఢీకొని వృద్ధుడి మృతి


వీరరాఘవులు (ఫైల్)

ఉప్పలగుప్తం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. ఎస్ఐ చలమల రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వానపల్లిపాలెంకు చెందిన కోలా వీరరాఘవులు(75) ఉప్పలగుప్తం నుంచి వానపల్లిపాలెం సైకిల్‌పై వెళ్తుండగా ఐషర్ వ్యాన్ వెనుక నుంచి ఢీ కొనడంతో వీరరాఘవులు అక్కడికక్కడే మరణించాడు. మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బైక్ ఢీకొని మహిళ మృతి

నరేంద్రపురం జంక్షన్ వద్ద ఘటన

రాజానగరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రాజానగరం-నరేంద్రపురం కూడలిలో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో 16వ వార్డుకు చెందిన అనిశెట్టి లత(33) రాజానగరంలో బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయలుదేరింది. రాజానగరం సమీపంలోని నరేంద్రపురం జంక్షన్ వద్ద నడుచుకుంటూ హైవే దాటుతుండగా దివాన్‌చెరువు వైపుగా వేగంగా, నిర్లక్ష్యంగా వస్తున్న మోటార్‌సైకిల్ ఢీకొంది. దీంతో లత తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి వద్ద ఉన్న ఫోన్ నెంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా లత భర్త అనిశెట్టి శ్రీను బండిపై టిఫిన్ అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె గాయత్రి ఇంటర్మీయట్ పూర్తి చేయగా, చిన్న కుమార్తె కావేరి ఇంటర్ మొదటి ఏడాది చదువుతోంది. మృతురాలి భర్త ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

నలుగురి అరెస్ట్.. రూ.8.40 లక్షల నగదు, 8 సెల్‌ఫోన్లు, టీవీ స్వాధీనం


క్రికెట్ బెట్టింగ్ ముఠా వివరాలు వెల్లడిస్తున్న నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్

కోరుకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నార్త్‌జోన్ పరిధిలో స్థానిక పోలీసులు క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. కోరుకొండ పోలీస్‌స్టేషన్లో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ వివరాలను వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు కోరుకొండ మండలం కాపవరంలోని ఓ ఇంట్లో నిర్వహించిన దాడుల్లో బెట్టింగ్ ముఠాను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.8.40 లక్షల నగదు, 8 సెల్‌ఫోన్లు, టీవీ, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. బెట్టింగ్‌కి పాల్పడుతున్న ప్రధాన నిందితుడిగా గుర్తించిన విశాఖపట్నానికి చెందిన రాకేష్ పరారీలో ఉన్నాడని.. బెట్టింగ్‌కు పాల్పడిన గోసంశెట్టి వీరప్రసాద్, జాజుల బాలచక్రం, నల్లల లక్ష్మీనరసయ్య, కొడతాల నానాజీని అరెస్ట్ చేశామన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన కోరుకొండ, సీతానగరం పోలీస్ సిబ్బందికి రివార్డు అందజేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఆన్‌లైన్ బెట్టింగ్‌ల వల్ల కుటుంబాలు నాశనం అవుతున్నాయని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో సీఐ వైసత్యకిషోర్, ఎస్ఐ కేవీ నాగార్జున, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

29న పవర్‌లిఫ్టింగ్ పోటీలు


పవర్‌లిఫ్టింగ్ పోటీల ట్రోఫీలు, మెడల్స్‌ను ఆవిష్కరిస్తున్న శరత్‌బాబు తదితరులు

అమలాపురం టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 29న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో 4వ యునైటెడ్ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరి జిల్లాల పవర్‌లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్టు పవర్‌లిఫ్టింగ్ పోటీల ఆర్గనైజర్, కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థాయిలో జరిగే పోటీల వివరాలను జిల్లా ఒలింపిక్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి వివరించారు. సబ్ జూనియర్, సీనియర్, మాస్టర్స్ విభాగాల్లో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా 30 కేటగిరీల్లో ఈ పోటీలను నిర్వహిస్తామన్నారు. విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు, ఒలింపిక్ మెడల్స్ చాంపియన్ షిప్ ట్రోఫీలతో పాటు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ పోటీల ట్రోఫీలు, చాంపియన్స్ మెడల్స్‌ను ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో ఆదివారం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు ఆవిష్కరించారు. ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ గోకరకొండ నాగేంద్ర, ఉపాధ్యక్షుడు కల్వకొలను బాబు, జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, ట్రోఫీల స్పాన్సర్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అడపా వెంకటసుబ్రహ్మణ్యం, ఆశెట్టి ఆదిబాబు, పెద్దిరెడ్డి రాము, యెరుబండి చంటి, గొలకోటి నారాయణరావు, నార్ని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళపై మేల్ నర్స్ అకృత్యాలు

- తనతో ఉండాలని వేధింపులు
- ఫొటోలను మార్ఫింగ్ చేసి బాధితురాలి కొడుక్కి పంపిన వైనం
- కాకినాడ వన్‌టౌన్ పీఎస్‌లో కేసు

జీజీహెచ్(కాకినాడ) ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో మేల్ నర్స్‌గా పనిచేస్తున్న సందీప్ అనే వ్యక్తి ఓ మహిళపై అకృత్యాలకు పాల్పడాడు. అతడు చేస్తున్న దారుణాలపై ఆ మహిళ ఆదివారం సాయంత్రం కాకినాడ వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్టు సీఐ ఎం.నాగదుర్గారావు తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారురాలి భర్త కొంతకాలం క్రితం మరణించాడు. ఆమె మనోవేదనకు గురైన సమయంలో కాకినాడ జీజీహెచ్‌లో మేల్ నర్సుగా పనిచేస్తున్న సందీప్ దగ్గరయ్యాడు. సహజీవనం పేరుతో ఆమెతో చనువు పెంచుకున్నాడు. నాటి నుంచి బాధితురాలికి తెలియకుండా స్నానం చేస్తున్నప్పుడు ఫొటోలు, వీడియోలు తీసి భద్రపర్చుకున్నాడు. ఆ ఫొటోలను అడ్డుపెట్టుకుని తన భార్యకు విడాకులు ఇస్తున్నానని, ఆమెను పెళ్లి చేసుకోమని బలవంతం చేశాడు. అప్పటికే సందీప్ స్త్రీలోలుడని, దురలవాట్లు ఉన్నవాడని గుర్తించిన మహిళ తనకు ఇష్టం లేదని తెగేసి చెప్పింది. దీంతో సందీప్ దాచిపెట్టుకున్న ఫొటోలతో పాటు మరికొన్ని ఫొటోలను మార్ఫింగ్ చేసి ఆమెకే పంపాడు. ఆమె ప్రశ్నించగా తనతో ఉంటే ఫొటోలు ఎవరికి పంపనని లేదా సోషల్ మీడియాలో పెడతానని చెప్పాడు. బాధితురాలు లొంగకపోయేసరికి బంధువులందరికీ ఆ ఫొటోలను పంపాడు. ఆమె నుంచి ఏ స్పందన లేకపోయేసరికి శనివారం రాత్రి ఆ ఫొటోలను బాధితురాలి కొడుకైన మైనర్ బాలుడికి పంపించాడు. ఫోన్ చేసి మరీ బాలుడికి చెప్పాడు. బాలుడు ఫొటోలు చూసి మనస్తాపం చెందాడు. శనివారం రాత్రి ఆ బాలుడు ఇంటి నుంచి బయటకు వచ్చేసి నేను తట్టుకోలేకపోతున్నాను బ్రతకనని చెప్పి వెళ్లిపోయాడు. బంధువులు ఆ బాలుడి కోసం గాలించి ఆదివారం గుర్తించారు. సందీప్ అకృత్యాలు తాళలేకపోయిన మహిళ పోలీసులను ఆశ్రయించింది. రాష్ట్ర మహిళా కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసింది. వన్‌టౌన్ పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. సందీప్ పరారీలో ఉన్నాడని, అతడి ఆచూకీపై దర్యాప్తు చేస్తున్నామని సీఐ నాగదుర్గారావు తెలిపారు.

వాడపల్లి వెంకన్నకు బంగారు ఆభరణాలు సమర్పణ

ఆత్రేయపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలోని వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామికి ఓ అజ్ఞాత భక్తుడు 107 గ్రాముల బంగారు ఆభరణాలను సమర్పించాడు. శనివారం రాత్రి స్వామిని దర్శించుకున్న భక్తుడు 90 గ్రాముల కంఠాభరణం, 17 గ్రాములతో బంగారు గొలుసు సుమారు రూ.11లక్షల విలువైన వస్తువులను సమర్పించాడు. సంప్రోక్షణ అనంతరం స్వామివారికి అలంకరించనున్నారు.

శ్రీపాద శ్రీవల్లభులకు సహస్ర లిల్లీ పుష్పపూజ


లిల్లీ పుష్పపూజ అనంతరం ప్రత్యేక అలంకారంలో శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతి

పిఠాపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో జరుగుతున్న శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా నాల్గోరోజు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీపాదులకు సహస్ర లిల్లీ పుష్పపూజ నిర్వహించారు. శ్రీపాదశ్రీవల్లభుల దివ్య పాద పద్మములకు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. గోపూజ, పల్లకీసేవ జరిగాయి. శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయుడు, నృసింహ సరస్వతులను పుష్పాలు, తులసీదళాలుతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజాది కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా ఆలయ ఈవో ఆర్.సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు, రేపు దిండి-చించినాడ వంతెనపై రాకపోకలు నిలుపుదల



మలికిపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దిండి-చించినాడ వంతెన మరమ్మతులు నిర్దేశిత గడువులోగా పూర్తి కాని దృష్ట్యా మరో 2 రోజుల పాటు వంతెనపై పూర్తిగా రాకపోకలు నిలుపుదల చేయనున్నట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వంతెన వద్ద బేరింగ్ రీప్లేస్ పనులు, ట్రాఫిక్ బ్లాక్ నియంత్రణ కోసం ఈ నెల 25, 26న ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు రాకపోకలను పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు. దిండి-చించినాడ 216 జాతీయ రహదారిపై పర్యటించే వాహనదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని, ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని కోరారు.

నేటి నుంచి సఖినేటిపల్లి రేవులో పంటు రాకపోకలు

అంతర్వేది, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరదల నేపథ్యంలో 3 రోజుల పాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి రేవులో పంటు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో సోమవారం నుంచి సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో పంటు రాకపోకలు ప్రారంభంకానున్నాయి. ప్రయాణాలు సులభతరం అవుతాయని అధికారులు తెలిపారు.

31న రోటరీ డిస్ట్రిక్ట్ మెంబర్‌షిప్ సెమినార్

కాకినాడ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం దివాన్‌చెరువు సమీపంలోని ఎస్‌విపిసి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 31న రోటరీ డిస్ట్రిక్ట్ మెంబర్‌షిప్ సెమినార్‌ను డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్ చోడిశెట్టి పద్దరాజు తెలిపారు. కాకినాడ రోటరీ హాల్‌లో రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ప్రత్యేక సమావేశం ప్రెసిడెంట్ డాక్టర్ గోపీనాథ్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పద్దరాజు మాట్లాడుతూ సెమినార్‌కు కృష్ణా జిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లా వరకు అన్ని రోటరీ క్లబ్‌ల సభ్యులు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా రోటరీ బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి మాచారెడ్డి ప్రతిపాదించిన రవి సోలార్ ఇంజనీరింగ్ సంస్థ అధినేత రవీంద్రనాధ్‌రెడ్డికి రోటరీ సభ్యత్వం పిన్ను అందజేశారు. సమావేశంలో క్లబ్ కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ సానా, కోశాధికారి ఉదయచక్రవర్తి, సభ్యులు పాల్గొన్నారు.

పేకాడుతున్న పది మంది అరెస్ట్

కోరుకొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం దోసకాయలపల్లి తోటల్లో పేకాట శిబిరంపై దాడి చేసి పది మందిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ నాగార్జున ఆదివారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేశామన్నారు. 10 మందిని అరెస్ట్ చేసి రూ.41 వేలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.


కానుగ.. కొన ఊపిరితో నిలిచెగ!

కొన ఊపిరితో అంటూ అప్పుడప్పుడూ వింటుంటాం.. దానికి ఈ కానుగ వృక్షం తార్కాణంగా నిలిచింది. కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని వైఎస్ఆర్ నగర్‌లో నీడనిచ్చే కానుగ వృక్షాన్ని విద్యుత్ సిబ్బంది కొమ్మలకు బదులు మొదలు నరికేశారు. కాండం మొత్తం తెగిపడగా బెరడు మాత్రం మిగిలిఉంది. ఆ బెరడు(కొన)తో కానుగ వృక్షం చిగిరించింది. కొన ఊపిరితో (జీవించడం) చిగురించించడం ఇదేనేమో.. ఈ వృక్షం చూపరులను ఆశ్చర్యపరుస్తుంది..

ఆంధ్రజ్యోతి, -రామచంద్రపురం (ద్రాక్షారామ)

గుర్తుకొస్తున్నాయి...

50 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల కలయిక

రామచంద్రపురంలో...



కొత్తపేటలో...



రామచంద్రపురం(ద్రాక్షారామ)/కొత్తపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలలో 1975 నుంచి 78 వరకు బీఎస్సీ విద్యను అభ్యసించిన 50 ఏళ్ల తర్వాత కలిశారు. ఆదివారం బుచ్చిరాజు కల్యాణవేదికపై అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయురాలు కె.నాగరాజకుమారిని సత్కరించారు. వీఎస్ఎం ప్రిన్సిపాల్ అన్సారీ, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకుడు కామేశ్వరరావు, డా.చెలికానిస్టాలిన్ వారికి అభినందనలు తెలిపారు. పూర్వవిద్యార్థులు హైకోర్టు న్యాయ వాది సార్వభౌమారావు, విశ్రాంత న్యాయమూర్తి కామేశ్వరి దంపతులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అలాగే కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1972-74 మధ్య ఇంటర్ చదువుతున్న అప్పటి విద్యార్థులు సుమారు 50 ఏళ్ల తరువాత ఆదివారం కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కలుసుకున్నారు. పాతజ్ఞాపకాలు గుర్తుకుతెచ్చుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పట్లో ఇక్కడ చదివిన విద్యార్థిని యూఎస్ఏలో డాక్టర్‌గా పనిచేస్తుండగా ఆ దంపతులను, ఇక్కడ అధ్యక్షుడిగా కార్యక్రమాలు నిర్వహించిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం- అనంతకుమారి దంపతులను పూర్వపు విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏబీ భాణి, కెప్రసాదవర్మ, పప్పుల వీరభద్రరావు, సత్యవరపు సత్యనారాయణ, ముత్యాల మాధవరావు, కేతినీడి సత్యనారాయణమూర్తి, పెంటా భాస్కరరావు, జి.కృష్ణ, ఆర్.రామారావు, కె.రాజేశ్వర్, అక్కిరెడ్డి వెంకటేశ్వరరావు,భీమాల వెంకటేశ్వరరావు ఉన్నారు.

సొసైటీ పాలకవర్గాల ప్రమాణ స్వీకారాలు



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ రామస్వామి

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలమూరు, కాతేరు, తొర్రేడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో నూతనంగా నియమితులైన త్రిసభ్య కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు. తొర్రేడులో జరిగిన కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి విచ్చేశారు.కోలమూరు సొసైటీ చైర్మన్‌గా అడ్డాల శ్రీను, సభ్యులుగా అల్లాడ రమణ, తాటిపాక వెంకటేశ్వరరావు, కాతేరు సొసైటీ చైర్మన్‌గా నున్న బాబూరావు, సభ్యులుగా ఈదల రాఘవబాబు, సోము గంగాధర్, తొర్రేడు సొసైటీ చైర్మన్‌గా దండమూడి బాపినీయుడు, సభ్యులుగా నల్లూరి రామకృష్ణ, విన్నకోట శేషాచార్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సొసైటీలను నిర్వీర్యం చేశారన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ తొర్రేడు సొసైటీ రైతులకు చేస్తున్న సేవలకు సీఈవో సత్యనారాయణ, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవరావు, వాసిరెడ్డి రాంబాబు, గంగిన హనుమంతరావు, దండమూడి ప్రమీల,పిన్నమరెడ్డి ఈశ్వరుడు, కామిన భాస్కరరావు, గంగిన జాహ్నవి,బీమరశెట్టి రమేష్, మన్యం నరేంద్ర నాగ్, కురు కూరి కిషోర్ పాల్గొన్నారు.ముందుగా తొర్రేడు సొసైటీలో పాలకవర్గ సభ్యులను రామస్వామి సత్కరించారు.

భవన నిర్మాణాలకు, ప్లానింగ్‌కు వ్యత్యాసముంటే చర్యలు: కలెక్టర్

రాజమహేంద్రవరంలో పలు భవనాలను పరిశీలించిన ఇన్‌చార్జి కమిషనర్



భవనాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో నిర్మాణ దశలో ఉన్న భవనాలకు, వాటి ప్లానింగ్‌కు మధ్య వ్యత్యాసం ఉంటే తక్షణమే చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు కలెక్టర్, నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని విద్యానగర్, వీవర్స్ కాలనీ, తాడితోటలోని కరుణశ్రీ ఆసుపత్రి, జేఎన్ రోడ్డులోని సాల్ట్ హోటల్, ఏవీఏ రోడ్డులోని పాంటలూన్స్ సహ పలు భవనాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాన్లకు, నిర్మాణాలకు తేడాలుంటే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సచివాలయ పరిపాలన కార్యదర్శులు ఉదయం 8నుంచి క్షేత్రస్థాయికి వెళ్లి అండర్ అసెస్మెంట్, ఖాళీ స్థలాలను గుర్తించి పన్ను విధించాలని ఆదేశించారు. ఇందుకు పూర్తి బాధ్యత అడ్మిన్ సెక్రటరీలు, ఆర్‌ఐలు వహించాల్సి ఉంటుందన్నారు. అలాగే సచివాలయాల వారీగా పురోగతిపై రోజూ వారి నివేదికలను అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డీసీ ఎస్.వెంకటరమణ, సీహెచ్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం: ఎస్పీ



ఆర్థిక సహాయం చెక్కును అందజేస్తున్న ఎస్పీ కిషోర్

రాజమహేంద్రవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నామని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. ముగ్గురు హోంగార్డులకు వైద్య చికిత్సకు రూ.5 వేలు చొప్పున, ఒక హోంగార్డు కుమార్తె వివాహం నిమిత్తం రూ.5 వేలు పోలీసు వెల్ఫేర్ ఫండ్ నుంచి అందజేశారు. ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు హోంగార్డులకు రూ.1.50 లక్షలు చొప్పున జిల్లాలోని హోంగార్డులు తమ ఒక రోజు వేతనాన్ని ఆర్థిక సహాయంగా సమకూర్చగా, ఎస్పీ ఆ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీ కృష్ణ, ఏవీ సుబ్బ రాజు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రంలో 453 మందికి ఆశ్రయం

ఆర్డీవో కృష్ణనాయక్



పునరావాస కేంద్రంలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గోదావరి వరదల నేపథ్యంలో రాజమహేంద్రవరంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో 453 మందికి ఆశ్రయం కల్పించినట్టు ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ తెలిపారు. ఆదివారం ఆల్కాట్ గార్డెన్స్‌లోని మునిసిపల్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వరద బాధితుల పునరావాస కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కేతావారి లంకకు చెందిన 81 మందికి, వెదుర్లమ్మ లంకు చెందిన 142 మందికి, గోదావరి గట్టు కింద నివాసం ఉండే 15 మందికి, గౌతమి ఘాట్ సమీపంలో ఉండే 45 మందికి, బ్రిడ్జి లంకకు చెందిన 170 మందితో కలిపి మొత్తం 172 కుటుంబాలకు చెందిన 453 మంది మత్స్యకారులకు పునరావాస కేంద్రంలో ఆశ్రయం కల్పించినట్టు పేర్కొన్నారు. వారికి అందిస్తున్న భోజన, వైద్య సదుపాయాలను పరిశీలించామని ఆర్డీవో చెప్పారు. వరదలు తగ్గుముఖం పట్టే వరకు ఆశ్రయం కల్పిస్తామన్నారు.

22,309 స్మార్ట్ రేషన్ కార్డులు సిద్ధం

బిక్కవోలు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలం మొత్తం మీద 22,309 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీకి సిద్ధం చేశామని తహశీల్దార్ సత్యకృష్ణ ఆదివారం తెలిపారు. ఈ కార్డులను గ్రామాల వారీగా సచివాలయాలకు అందజేస్తామన్నారు. వారు లబ్ధిదారులకు అందజేస్తారని వచ్చే నెల 1 నుంచి ఈ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ పొందాలని తెలిపారు.

నిలువ నీడ కరువు

- పరీక్షల కోసం జీజీహెచ్ వచ్చే టీబీ అనుమానితుల దుస్థితి
- మండుటెండలో నిలబడక తప్పదు
- వానొచ్చినా అంతే!
- పట్టించుకోని వైద్యాధికారులు



టీబీ టెస్టుల కోసం శాంపిల్స్‌తో జీజీహెచ్ 4వ నెంబరు గది కిటికీ బయట నిలబడి ఎదురుచూస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): టీబీ అనుమానిత లక్షణాలతో పరీక్షలు చేయించుకునేందుకు రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి(జీజీహెచ్)కి వస్తున్న వారి పరిస్థితి దయనీయంగా ఉంటోంది. ఎండకు ఎండి... వానకు తడుస్తూ అన్న చందంగా నానా అగచాట్లు పడుతున్నారు. కూర్చోడానికి కాదు కదా, కనీసం నిలబడడానికి ఇక్కడ సరైన చోటు లేదు. శాంపిల్స్ కలెక్ట్ చేసే 4వ నెంబరు గది కిటికీ అవతల కంపుగొట్టే డ్రైనేజీ పక్కనే నిలబడి అనుమానితులు టెస్టు శాంపిల్స్ డబ్బాతో ఎదురు చూడాల్సి ఉంటుంది. టెస్టుల కోసం వచ్చేవారు మండుటెండలో నిలబడక తప్పదు. వర్షం కురిస్తే తడుస్తూనే శాంపిల్స్ ఇవ్వాలి. అంతటి దయనీయమైన, దారుణ పరిస్థితులు ఇక్కడ ఉన్నాయి. రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు ప్రతి రోజూ సుమారు 50 నుంచి 60 మంది వరకూ అనుమానితులు శాంపిల్స్ పట్టుకుని టెస్టులకు వస్తుంటారు. అప్పటికే టీబీకి మందులు వాడుతున్న వారు రెండు నెలలకు ఒకసారి క్లినికల్ సర్వేకు వస్తారు. ఏఆర్‌టీ సెంటర్ల నుంచి టీబీ రోగులు, అనుమానితులు పెద్ద సంఖ్యలోనే వస్తుంటారు. చుట్టుపక్కల గ్రామాల్లోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులతోపాటు ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి అనుమానిత లక్షణాలున్నవారు ఇక్కడికే టెస్టులకు వస్తుంటారు. జీజీహెచ్‌లో అత్యాధునిక సీబీ నాట్, ట్రూ నాట్ పరీక్షలు చేస్తుంటారు. రెండు గంటల్లో రిపోర్టులు వస్తాయి. రద్దీ ఎక్కువగా ఉంటే మరుసటి రోజు రావాల్సి ఉంటుంది.రిపోర్టులో పాజిటివ్ వస్తే మందులు పెడతారు. చాలా మంది అనుమానిత లక్షణాలున్నా టీబీ పరీక్షల కోసం జీజీహెచ్‌కు రావడానికి వెనుకంజ వేస్తుంటారు. వైద్య, ఆరోగ్యశాఖ ఫీల్డు సిబ్బంది ఎలాగోలా వారిని ఒప్పించి జీజీహెచ్‌కు తీసుకొస్తున్నా ఇక్కడి దారుణమైన పరిస్థితులు వారికి శాపంగా మారుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. టీబీ అనుమానిత బాధితులకు కనీస సౌకర్యాలు ఏర్పాటుపై రాజమహేంద్రవరం జీజీహెచ్ వైద్యాధికారులు నిర్లక్ష్యం చూపడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చురుగ్గా చవితి ఉత్సవ పనులు

బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో ఏర్పాట్లు.. దర్శనానికి ఇబ్బందులు లేకుండా లైన్లు



బిక్కవోలులో చవితి ఉత్సవాలకు పందిరి డెకరేషన్

బిక్కవోలు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతి ఆలయంలో వినాయక చవితి ఉత్సవ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 27న ప్రారంభమయ్యే చవితి ఉత్సవాలను వచ్చే నెల 6 వరకూ నిర్వహిస్తామన్నారు. భక్తులు స్వామి దర్శనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా లైన్లు ఏర్పాటు చేశామని, వర్షం వచ్చినా తడవకుండా ఆలయ ఆవరణ అంతా రేకులతో షెడ్డు నిర్మించామన్నారు. ప్రాంగణానికి విద్యుద్దీపాలంకరణ చేశామన్నారు.

దివాన్‌చెరువు: లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీలోని నిర్మల్‌గ్రామ పురస్కార్ వేదిక వద్ద ఏర్పాటు చేసే మందిరంలో శ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 27 నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఉత్సవ కమిటీ ఆదివారం తెల్పింది. ఆ రోజు ఉదయం 7 గంటలకు వినాయక విగ్రహ ప్రతిష్ట జరుగుతుందన్నారు. వచ్చే నెల 6న స్వామివారి ఊరేగింపు, నిమజ్జనం, ఆ మరునాడు అన్నసమారాధన జరుగుతుందని చెప్పారు.

మట్టి ప్రతిమల పంపిణీ

అనపర్తి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మట్టి గణనాథులను పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం రామవరంలో విశాఖపట్నానికి చెందిన స్వాతి ప్రమోటర్స్ ఆధ్వర్యంలో ఐదువేల మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. స్వాతి ప్రమోటర్స్ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ ఏడాది ఐదువేల మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రామవరం, కుతుకులూరు గ్రామాల కూటమి నాయకులు పాల్గొన్నారు.



రామవరంలో మట్టి ప్రతిమల పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

వరద తగ్గినా.. తెరుచుకోని ఘాట్లు



ఎగువన కురిసిన వర్షాలకు గోదావరికి ఇటీవల వరద పోటెత్తింది. ఈ సందర్భంగా మొదటి రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద నీరు వచ్చి చేరింది. ఈ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు కలెక్టర్, ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్ ప్రశాంతి ఆదేశాలతో మునిసిపల్ సిబ్బంది గోదావరి ఘాట్ల వద్ద ఎవరూ గోదావరిలోకి దిగకుండా ఉండేం దుకు కర్రలు కట్టేశారు. అయితే రెండు రోజులుగా వరద తగ్గుముఖం పట్టింది. ఆదివారానికి సాధారణ స్థాయికి చేరుకుంది. అయినప్పటికీ మునిసిపల్ సిబ్బంది కర్రలు తొలగించలేదు. దీంతో ఘాట్లు తెరుచుకోలేదు. ఈ సమయంలో నిత్య పూజలు స్నానాలు ఆచరించే భక్తులు గోదావరిలోకి దిగేందుకు అవకాశం లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. -ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం.

మహాధర్నాను జయప్రదం చేయండి

ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ త్రినాథబాబు

దివాన్‌చెరువు, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2003 ఉపాధ్యాయులు పాతపెన్షన్ సాధనకై విజయవాడలో ఈనెల 25న (నేడు) చేయనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ సూరి జయత్రినాథబాబు విజ్ఞప్తి చేశారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం మెమో నెం.57 ద్వారా పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డీఎస్సీ-2003 ఫోరం పక్షాన జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఫ్యాప్టో సంపూర్ణ మద్దతు ప్రకటించిందని చెప్పారు. ఉపాధ్యాయులందరూ అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ ధర్నాను జయప్రదం చేయాలని త్రినాథబాబు కోరారు.

'రాజధాని అమరావతిపై వైసీపీ దుష్ప్రచారం'

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిపై వైసీపీ నేతలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమరావతిని లేపడానికి పొన్నూరును ముంచేశారంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన ఆరోపణలు నీటి మూటలని, తేలిపోయాయని అన్నారు. ప్రకాశం బ్యారేజ్ గేట్లు పనిచేయడం లేదని, బెజవాడ మునిగిపోతుందని, కాఫర్ డ్యాం కొట్టుకుపోతుందని, తుంగభద్ర గేట్లు లేవడం లేదంటూ వైసీపీ నాయకులు నిత్యం అసత్యాలే ప్రచారం చేస్తున్నారన్నారు.

జాతీయ సేవా పురస్కారాలు ప్రదానం

నిడదవోలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యదర్శి వంగా కృపానంద వరప్రసాద్‌కు జాతీయ సేవా పురస్కారం లభించింది. ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలోని సీఆర్‌సీ ఫంక్షన్ హాలులో మదర్ థెరిస్సా ఎడ్యుకేషనల్ సొసైటీ వారు అందించారు. దివ్యాంగులకు విశేష సేవలందిస్తున్న కృపానంద వరప్రసాద్‌కు ఈ పురస్కారం అందించి సత్కరించారు. దీంతో పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

పెరవలి: కానూరుకు చెందిన అమ్మ బ్లడ్ ఆర్గనైజేషన్ నిర్వాహకుడు రాముకు సెయింట్ మదర్ థెరీసా జాతీయ సేవా పురస్కారం లభించింది. ఆదివారం రావులపాలెంలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ డాక్టర్ దిడ్ల కిషోర్ సమక్షంలో అవార్డును అందుకున్నారు.కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 75 మందికి అవార్డులు అందజేశారు. అవార్డు రావడం తనకు చాలా సంతోషంగా ఉందని డాక్టర్ రాము పేర్కొన్నారు.

'క్రైస్తవులకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి'

కొవ్వూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు గాను వారికోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆలిండియా క్రిస్టియన్ జేఏసీ జాతీయ కన్వీనర్ బొంతా శ్యామ్ రవిప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ నెల 24న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జాతీయ కోఆర్డినేటర్ మార్టిన్ లూథర్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఇందులో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జీఎస్‌ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం పాల్గొని ప్రసంగించారన్నారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై క్రైస్తవులకున్న అనుమానాలను ప్రభుత్వం నివృత్తి చేయాలన్నారు.



నిత్యాన్నదాన పథకానికి విరాళం

సామర్లకోట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో నిత్యాన్నదాన పథకానికి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన జోశ్యుల వెంకటసోమయాజులు పేరిట రూ.50,014 విరాళాన్ని జోశ్యుల సుబ్బలక్ష్మి... ఈవో బళ్ళ నీలకంఠానికి అందజేశారు. తొలుత సుబ్బలక్ష్మి, కుటుంబ సభ్యులు భీమేశ్వరస్వామిని, బాలాత్రిపురసుందరి అమ్మవార్లను దర్శించారు. నంది మండపం వద్ద సుబ్బలక్ష్మికి వేదాశీర్వచనంతో ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని ఈవో అందజేశారు.

సీఎం సహాయ నిధి ఒక వరం: మంత్రి



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి దుర్గేష్

నిడదవోలు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు ఒక వరం లాంటిదని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం సమిశ్రగూడెంలోని ఎంపీడీవో కార్యా లయంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గంలో 59 మంది లబ్ధిదారులకు రూ.29.72 లక్షల విలువైన చెక్కులు అందించామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు సీఎం సహాయ నిధి నుంచి 294 మందికి రూ.2.45 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. కూటమి ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొవ్వూరు: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆదివారం చాగల్లు మండలానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. చాగల్లు మండలంలోని చాగల్లు, ఊనగట్ల, చంద్రవరం, మార్కొండపాడు, బ్రాహ్మణగూడెం, దారవరం, నందిగంపాడు గ్రామాలకు చెందిన తొమ్మిది మందికి రూ. 2,97,062 విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, ఆళ్ల హరిబాబు, ఉండవల్లి గోపాల్, మద్దిపట్ల సురేష్, చాగల్లు మండల నాయకులు పాల్గొన్నారు.

'పరిమితి మేరకు యూరియా వాడాలి'

దేవరపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వరి పంటకు అవసరం మేరకే యూరియా వాడాలని రైతులకు సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పులూరి రామారావు సూచించారు. ఆదివారం సొసైటీ కార్యాలయం వద్ద ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేవరపల్లి సొసైటీ పరిధిలోని గ్రామాలైన దేవరపల్లి, రామన్నపాలెం, కొత్తగూడెం, ధూమంతనగూడెం, సుబ్బరాయపురం, అచ్చెయ్యపాలెం, బుచ్చయ్యపాలెంకు చెందిన రైతులకు మాత్రమే యూరియా అందజేయడం జరుగుతుందని, దేవరపల్లి సొసైటీకి 12 టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. యూరియా కావల్సిన రైతులు ఆధార్‌కార్డుతో పాటు పొలంపాసు బుక్ తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సొసైటీ సీఈవో కల్లూరి శ్రీనివాస్ శర్మ, రైతులు పాల్గొన్నారు.

ఆశయం ఘనం..



నిర్వహణ శూన్యం



పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. అధికారులు కూడా మొక్కలు నాటి వాటిన సంరక్షించాలని ఊకదంపుడు ప్రసంగాలు చేశారు. ప్రసంగాలైతే చేశారు గాని వారు నగరంలో ఉన్న మొక్కలను మాత్రం గాలికి వదిలేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో రాజమహేంద్రవరంలోని పుష్కర ఘాట్ వద్ద ఐ లవ్ రాజమహేంద్రవరం పక్కనే వర్టికల్ గార్డెన్ ఏర్పాటు చేసి మొక్కలు వేశారు. ప్రారంభమైతే ఘనంగా జరిగింది. గాని నిర్వహణ శూన్యం.. తర్వాతి కాలంలో ఆ మొక్కలకు నీరు పోయకపోవడంతో ఎండిపోయాయి. దీంతో మునిసిపల్ కార్పొరేషన్ చేసిన ఖర్చు వృథాగా పోవడమే కాకుండా ప్రధాని మోదీ ఆశయానికి తూట్లు పడినట్టుయింది.


-ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: పరదా
సూర్యమినీ	: మహావతార్ నరసింహ
సూర్యప్యాలస్	: పరదా
స్వామి	: కూలీ
అనుశ్రీ(సాయికృష్ణ)	: కూలీ
శివజ్యోతి	: బన్ బటగ్ జామ్
రాజా	: వార్-2
ఊర్వశి	: కూలీ
మేనక	: యూనివర్శిటీ
రంభ	: స్టాలిన్
కుమారి	: ----
అప్సర	: వార్-2
అశోక	: వార్-2
వీఎస్ మహాల్(నామవరం)	: కూలీ
మురళీకృష్ణ(ధవళేశ్వరం	: కూలీ
వెంకటసూర్య(కడియం)	: కూలీ
సత్యగౌరి (అనపర్తి)	: కూలీ
సూర్యశ్రీ (అనపర్తి)	: వార్-2
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: కూలీ
రామకృష్ణ(కోరుకొండ)	: మహావతార్ నరసింహ
గీతాసినిమాస్ (సీతానగరం)	: మహావతార్ నరసింహ
శ్రీనివాస (గోకవరం)	: వార్-2
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: కూలీ
లలితామహాల్(రంపచోడవరం)	: మహావతార్ నరసింహ
నవయుగ(చింతూరు)	: హరిహర వీరమల్లు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి జిల్లా వార్తలు
సోమవారం 25 ఆగస్టు 2025 | 5









డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వాయిదా

» తదుపరి తేదీ త్వరలో వెల్లడిస్తాం
» కాకినాడ జిల్లా డీఈవో రమేష్


గొల్లప్రోలురూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నియామక ప్రక్రియకు సంబంధించి మెరిట్ లిస్ట్‌లో ఉన్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా పడింది. ఇది సోమవారం జరగాల్సి ఉండగా వాయిదా వేశామని, తదు పరి తేదీని త్వరలో వెల్లడిస్తామని కాకినాడ జిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు.

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఈపరిశీలన జరగాల్సి ఉంది. దీని నిమిత్తం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి మెరిట్ జాబితాలోఉన్న 1241 అభ్యర్థులు పరిశీలనకు హాజరుకావాలని ఇప్పటికే సమాచారం ఇచ్చారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం ఎంఈవోలు, గెజిటెడ్ హెచ్‌ఎం, డిప్యూటీ తహసీల్దారు, ఎంఐఎస్ ఆపరేటర్‌లతో కూడిన 25 తనిఖీ బృందాలను ఏర్పాటుచేశారు. దీనికోసం ఆదివారం సాయంత్రం బందోబస్తు ఏర్పాట్లను పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ పరిశీలించారు. కానీ, అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా పడింది. ఈ మేరకు ఆదివారం రాత్రి కాకినాడ డీఈవో ప్రకటన విడుదల చేశారు. పరిశీలన తేదీని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

గణపయ్యలు..సిద్ధమయ్యా!

ఊరూవాడా జరిగే పండుగ ఏదంటే టక్కున చెప్పేయవచ్చు.. వినాయక చవితి అని.. ఎందుకంటే ఏ వీధిలో చూసినా గణపయ్యలు దర్శనమిస్తారు.. ఒక్కో వీధిలో చూస్తే పోటాపోటీగా మూడు నాలుగు చోట్ల ఏర్పాటు చేస్తారు.. 9 రోజులు గణపతిని పూజిస్తారు.. బుధవారం వినాయక చవితి సందర్భంగా గణపతులు ముస్తాబవుతున్నారు.. ఎక్కడికక్కడ గణపయ్యలను సిద్ధం చేస్తున్నారు.. ఏడాదంతా కష్టపడి తయారుచేసిన విగ్రహాలకు తుదిరూపు ఇస్తున్నారు.. మరో పక్కన భారీగా విక్రయాలు చేస్తున్నారు.. 3 అడుగుల నుంచి 20 అడుగుల వరకూ విగ్రహాలు అమ్మకానికి సిద్ధంగా ఉంచారు.. పలు చోట్ల రెడీమేడ్‌గా విగ్రహాలను ఉంచి ఎత్తు ఆధారంగా రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు విక్రయిస్తున్నారు. చవితి నిర్వాహకులు విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు.

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం





కొత్త స్మార్ట్ కార్డులొస్తున్నాయ్.. / మంత్రి దుర్గేష్

నిడదవోలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తారని మంత్రి కందుల దుర్గేష్ తెలి పారు. మంత్రి క్యాంపు కార్యాల యంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాకు సంబంధించి 5,59,203 స్మార్ట్ రేషన్ కార్డులు తహశీల్దార్ల కార్యాలయాలకు చేరుకున్నాయన్నారు. పాత రేషన్ కార్డుల స్థానంలో వీటిని సచివాలయ సిబ్బంది ఇంటి వద్దనే అందజేస్తారన్నారు. సెప్టెంబరు 1 నుంచి రేషన్ షాపుల వద్ద కూడా అందజేస్తారని చెప్పారు.కార్డులకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. స్మార్ట్ కార్డులు క్యూఆర్ కోడ్‌తో ఉంటాయన్నారు. నిడదవోలులోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాలు లో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు.దివ్యాంగుల పెన్షన్ల తొలగింపులో అర్హులెవరూ ఆందోళన చెందవద్దని ఒక వేళ పొరపాటున అర్హులైన వారెవరికైనా పెన్షన్ ఆగిపోతే తిరి గిచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ,జడ్పీటీసీ కొయ్యే సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



గోదారి తగ్గింది..

ధవళేశ్వరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద వినాయక చవితికి వీధుల్లోకి వస్తుందనేది నానుడి.. ఈ ఏడాది కూడా అలాగే ఉంటుందని అంతా అనుకున్నారు. అయితే గత ఐదు రోజులుగా ఉరకలెత్తుతూ ఉధృతంగా ప్రవహించిన గోదావరి ఎట్టకేలకు తగ్గింది.. క్రమంగా సాధారణస్థాయికి చేరుకుంటుంది. ఎగువున వరద తగ్గుముఖం పట్టడంతో ధవళేశ్వరం వచ్చి చేరే వరద నీరు తగ్గింది. దీంతో పూర్తిగా ఎత్తివేసిన కాటన్ బ్యారేజ్ గేట్లను కిందకు దించి నీటి విడుదలను నియంత్రిస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం ఆర్మ్‌లోని మొత్తం గేట్లను 2 మీటర్ల మేర, మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌లోని మొత్తం గేట్లను 1.5 మీటర్లు మేర పైకి ఎత్తి 4,75,331 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 8.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాలకు తూర్పుడెల్టాకు 4600 క్యూసెక్కులు, సెంట్రల్ డెల్టాకు 2500 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 7000 క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.



ఆ నలుగురు.. కానిస్టేబుళ్లు!

రాజమహేంద్రవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పట్టుదల ఉంటే కానిది లేదు.. సాధించాలనే తపన ఉంటే ఆపేదెవరు.. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ.. హోంగార్డులు కానిస్టేబుళ్లుగా మారడం అరుదు.. జిల్లాలో హోంగార్డులుగా విధుల్లో ఉన్న వీవీ.వెంకట సురేశ్, కె.సతీశ్, కె.శ్రీను, వై.భీమరాజు సివిల్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు.ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు విడుదల కావడంతో ఎస్పీ నరసింహ కిశోర్ ఆదివారం వారిని పిలిచి తన కార్యాలయంలో శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. పోలీసు శాఖపై ఉన్న అవగాహన, అనుభవంతో మరింత ఉన్నతంగా సేవలందించాలని సూచించారు. క్రమశిక్షణ, నిజాయితీతో పని చేసి శాఖకు మరింత మంచి పేరు తీసుకురావడంలో భాగస్వామ్యం కావాలన్నారు. నిబద్ధతతో పని చేసి ప్రజలకు సమర్థవంతమైన సేవలందించాలన్నారు.



బార్‌మంటున్నారు!

బార్‌లకు ముందుకురాని వ్యాపారులు

» నష్టపోతామని వెనుకంజ
» ఇక మిగిలింది రెండు రోజులే
» 46 బార్లకు 11 ఎన్‌రోల్‌మెంట్లు
» దరఖాస్తులకు ఎక్సయిజ్ శాఖ పట్టు
» మద్యం దరఖాస్తుదారులకు మెసేజ్‌లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)
రండి బాబు.. రండి.. దరఖాస్తు చేయండి.. మంచి తరుణం మించిన రాదు..అంటూ గతంలో ప్రైవేటు మద్యం షాపులకు దరఖాస్తు చేసిన వాళ్లందరికీ ఎక్సయిజ్ అధికారులు వేలల్లో మెసేజ్‌లు పంపుతున్నారు. దాబాల వద్దకు వెళ్లి దరఖాస్తు చేయమని వేడుకుంటున్నారు. అయితే కొత్త బార్ పాలసీకి సంబంధించి వ్యాపారులు ముఖం చాటేస్తున్నారు.. ఎక్సైజ్ అధికా రులు మాత్రం దరఖాస్తులు పెరిగేలా చర్యలు చేపడుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 46 బార్‌లకు నోటి ఫికేషన్ విడుదల చేయగా ఇప్పటి వరకూ కేవలం 11 ఎన్‌రోల్‌మెంట్లు మాత్రమే జరిగాయి.అయినా ఒక్కో బార్‌కి 10 దరఖాస్తులు వస్తాయని ఎక్సయిజ్ అధికారులు ధీమాగా ఉన్నారు. ఈ నెల 26 (మంగళవారం) దరఖాస్తు గడువు ముగుస్తుంది. ఇంకా మిగి లింది రెండు రోజులే..అయినా ఎన్‌రోల్‌మెంట్ చూస్తేనే నీరసంగా ఉంది. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 1 నుంచి బార్‌లు ఉంటాయా.. అనే సందిగ్ధం ఫుల్‌గా ఉంది.

ఇవీ వ్యాపారుల లెక్కలు

రాజమహేంద్రవరంలో ఒక బార్‌కు దరఖాస్తు చేయాలంటే ఖర్చు ఇలా ఉంటుందని వ్యాపారులు లెక్కలు వేసుకుంటు న్నారు..ఒక్కో షాపునకు 4 దరఖాస్తులు తప్పనిసరి.. మూడు దరఖాస్తులు వచ్చినా లాటరీ ఉండదు. ఆ లెక్కన సిండికేట్‌గా 4 షాపులకు దరఖాస్తు చేయాలి.అంటే ఫీజు రూ.20.40 లక్షలు, లైసెన్స్ రుసుం ఏడాదికి రూ.55 లక్షలు, ఇష్యూ ప్రైస్‌పై 15 శాతం అదనంగా అదనపు రిటైల్ ఎక్సయిజ్ టాక్స్ (ఏఆర్‌ఈటీ) సుమారు రూ.54 లక్షలు, నెలకు బార్ అద్దె రూ.1.25 లక్షలు, కరెంటు బిల్లు రూ.30 వేలు, రవాణా రూ.30 వేలు, జీతాలు రూ.1.50 లక్షలు, సివిల్ పోలీ సులకు నెలకు రూ.15 వేలు, ఎక్సయిజ్ వాళ్లకు రూ.50 వేలు..ఇలా మొత్తం కలిపి సుమారు రూ.1.80 కోట్లు ఏడాదికి వెచ్చించాల్సి ఉంటుందని వ్యాపారులు లెక్కలు వేసి చూపిస్తున్నారు. ఇంత ఖర్చు చేసి తాము నష్టపోకుండా ఉండాలంటే రోజుకు కనీస అమ్మకం రూ.3 లక్షలు ఉండాలని, అలా ఉండాలంటే క్వార్టరుపై కనీసం రూ.50 అదనంగా అమ్మినా కష్టమేనని, ప్రైవేటు మద్యం షాపులకు పర్మిట్ రూమ్‌లు ఉండగా అంత సొమ్ము అదనంగా చెల్లించి బార్‌లకు ఎవరు వస్తారని అంటున్నారు. పక్క రాష్ట్రమైన తెలంగాణలో దరఖాస్తు ఫీజు రూ.1 లక్ష మాత్ర మేనని ఉదాహరణ చూపెడుతున్నారు.

బార్లు ఫుల్.. ఎన్‌రోల్‌మెంట్ నిల్

కొత్త బార్‌లకు సంబంధించి ఎన్‌రోల్‌మెంట్ నీరసంగా నడుస్తోంది. బార్‌ల లాటరీలో పాల్గొనాలంటే తొలుతగా ఉచితంగా ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాలి. తర్వాత ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలు చెల్లిస్తే ప్రక్రియ మొదలవుతుంది. అనంతరం రూ.5 లక్షలు దరఖాస్తు ఫీజు చెల్లించిన వారికి లాటరీలో పాల్గొనే అవకాశం దక్కుతుంది. అయితే ఉచితమైనప్పటికీ ఎన్‌రోల్‌మెంట్ అత్యంత నీరసంగానే సాగుతోంది. ఇంకా 2 రోజులే సమయం ఉన్నా కనీసం ఒక్క దరఖాస్తు సమర్పించలేదు.ఈ నెల 23న సాయంత్రం సమయానికి డా.బీఆర్ అంబేడ్కర్ కోన సీమ జిల్లాకు 9 బార్‌లు కేటాయించగా ఎన్‌రోల్‌మెంట్లు 4 జరిగాయి. ఇద్దరు మాత్రమే రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించారు.తూర్పు గోదావరి జిల్లాలో 22 షాపులకు మూడు ఎన్‌రోల్‌మెంట్లు జరగ్గా రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించలేదు. కాకినాడ జిల్లాకు సంబంధించి 15 బార్‌లకు ఐదుగురు మాత్రమే రిజిస్టరు అయ్యారు. ఒక్కో షాపునకు రూ.5.10 లక్షల చొప్పున దరఖాస్తు ఫీజును చెల్లించి 4 దరఖాస్తులు సమర్పించాలని తొలుత ప్రభుత్వం నిబంధన విధిం చినా వ్యాపారుల విన్నపాన్ని పరిగణనలోకి తీసుకొని దానిని సడలించింది. లాటరీలో షాపు దక్కించుకొన్న దరఖాస్తు మినహా మిగతా వారికి ఆ సొమ్ములు తిరిగిచ్చేస్తామని ఎక్సైజ్ కమిషనర్ ప్రకటించారు. అయినా ఎన్‌రోల్‌మెంట్ మాత్రం నీరసంగానే సాగుతోంది. ఎక్సయిజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ శనివారం జిల్లాకు రావడంతో ఆయనతో సమావేశమై ఇబ్బందులను వివరించవచ్చని బార్ వ్యాపారులు ఆశించినా ఫలించలేదు.

నిబంధనలు మార్చాలి..

బార్ పాలసీలో మార్పులు చేయకపోతే నెలకు కనీసం రూ.10 లక్షల వరకూ నష్టం భరించాల్సి ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.పక్క రాష్ట్రంలోని హైదరాబాద్, సికింద్రాబాద్ మెట్రో సిటీల్లో సైతం రూ.40 లక్షల వార్షిక ఫీజు ఉండగా 22 శాతం మార్జిన్ సదుపాయం ఉంది.అయినప్పటికీ అక్కడా నష్టాలు భరిస్తున్నారు.బార్ ఏర్పాటుకు ఫర్నిచర్, సామగ్రి వంటి వాటికి లక్షల్లో పెట్టుబడి పెట్టా లి. అందువల్ల వార్షిక లైసెన్సు ఫీజులో ఎంతో కొంత పెంపుదల చేసి అప్పటికే ఉన్న బార్‌లను కొనసాగిస్తారు.ఇదే విధానం తెలంగాణలో ఉన్నా నష్టాలు వస్తున్నాయి. ఏపీలో ఇప్పుడు మూడేళ్లలో లైసెన్స్ అంటున్నారు. తర్వాత మళ్లీ లాటరీ అంటే.. తమకు షాపు రాకపోతే లక్షల రూపాయల సామగ్రి, ఫర్నీచర్ ఏం చేసుకోవాలని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ఆ నిబంధన మార్చాల ని డిమాండ్ చేస్తున్నారు.



పుష్కర ఏర్పాట్లపై దృష్టి పెట్టండి

రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ సమీక్ష

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గోదావరికి 2027లో జరిగే పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని విస్తృత ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ఆదేశించారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో ఆదివారం రాత్రి కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి, కార్పొరేషన్ అధికారులతో సమీక్షించారు. పుష్కరాలకు వచ్చే యాత్రికులకు ఇబ్బందిలేకుండా సౌకర్యాలు చేపట్టాలన్నారు. పీపీపీ విధానంలో రాజమహేంద్రవరంలో హోటళ్లు, రెస్టారెంట్లు సంబంధిత సేవలకు ప్రైవేట్ భాగస్వామ్యాలు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రుడా పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రుడా మాస్టర్ ప్లాన్ 3,156 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో రూపొందించాల్సి ఉండగా ప్రస్తుతం 1,005 చదరపు కిలోమీటర్లతో మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ సిద్ధంగా ఉన్నట్టు అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. మిగిలిన ప్రాంతాలను అనుసంధానం చేస్తూ సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు.మాస్టర్ ప్లాన్‌పై ఉన్న అభ్యంతరాలు నోటీపై చేయాలన్నారు. రుడా పరిధిలో పంచాయతీలు, మునిసిపాలిటీల పరిధిలో మౌలిక వసతులపై దృష్టి సారించాలని సూచించారు. రుడా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ భూములను గుర్తించి ల్యాండ్ బ్యాంక్‌లను సిద్ధం చేసుకోవాలన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ మంత్రి సూచనల మేరకు రుడా పరిధిలో మౌలిక వసతులపై దృష్టి పెడతామన్నారు. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్), బిల్డింగ్ పెనాల్టీ స్కీమ్(బీపీఎస్)ద్వారా వచ్చే నిధులను రహదారులు, మురుగు కాలువలు వంటి పనులకు వినియోగిస్తామన్నారు.సమీక్షలో రుడా వైస్ చైర్మన్, జేసీ ఎస్ చిన్నరాముడు, సెక్రటరీ ఎం వీఆర్ సాయిబాబు, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ జీవీఎస్‌ఎన్ మూర్తి పాల్గొన్నారు.

తడిచెత్త.. పొడిచెత్త వేరు చేయలేరా?

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ నిర్వహణపై కలెక్టర్ ఆగ్రహం
ఏఈ గైర్హాజరుపై షోకాజ్ నోటీస్



సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ వద్ద అధికారులను ప్రశ్నిస్తున్న కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు చెందిన సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్లాంట్ పనితీరుపై కలెక్టర్, కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం పేపరు మిల్లు ఎదురుగా లూథర్‌గిరి వెనుక ప్రాంతంలో ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాంట్‌లో వ్యర్థాల సేకరణ, శుద్ధి, రీసైక్లింగ్ , కంపోస్టింగ్ పనుల తీరు పరిశీలించారు. హెల్త్ అధికారుల నుంచి ప్రాసెస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నగరంలో రోజుకు 160 టన్నుల చెత్త ఉత్పన్నం అవుతున్నా తడి చెత్త, పొడిచెత్త వేరు చేసే ప్రక్రియ సక్రమంగా జరగకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఏఈ గైర్హాజరు కావడంపై తీవ్రంగా స్పందించి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఏ స్థాయి అధికారి అయినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆమె వెంట అదనపు కమిషనర్ పీవీ.రామలింగేశ్వర్,డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఈఈ రీటా, డీఈ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

భూ కబ్జాదారులు, రౌడీ షీటర్లను ఉపేక్షించవద్దు

నేర సమీక్షలో ఎస్పీ నరసింహ కిషోర్



జిల్లా స్థాయి నేర సమీక్షలో ఎస్పీ నరసింహ కిశోర్, ఇతర అధికారులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): భూ కబ్జాదారులు, రౌడీ షీటర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశించారు. అలాంటి వారిపై పీడీ యాక్టు ప్రయోగించాలని, అవసరమైతే జిల్లా బహిష్కరణ చేయాలని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన చట్టాలకు లోబడి 60, 90 రోజుల్లో పు చార్జిషీట్లు దాఖలు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. సాంకేతికతను ఉపయోగిం చి పెండింగ్ కేసుల్లో పురోగతి సాధించాలని చెప్పారు.ప్రతి కేసు వివరాలు సీసీటీఎన్ఎస్‌లో డిజిటలైజేషన్ చేయాలన్నారు. గణేశ్ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పని చేయాలన్నారు. పెండింగ్ ఎన్‌బీడబ్ల్యులను అమలు పరచాలని స్పష్టం చేశారు. అనంతరం వినాయక ఉత్సవాలకు సంబంధించి పాటించాల్సిన విధి విధానాల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు మురళీకృష్ణ, సుబ్బరాజు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిని గుర్తించి ... సమాచారమివ్వండి

నిడదవోలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పెండ్యాలలోని కాలువగట్టుపై అస్వస్థతకు గురైన గుర్తు తెలియని వృద్ధుడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రిలోని ఆసుపత్రిలో చేర్పించారు. వృద్ధుడిని గుర్తించినవారు 94407 96661 ఫోన్‌నెంబర్‌కు సమాచారమివ్వాలని సమిశ్రగూడెం ఎస్‌ఐ బాలాజీ సుందరరావు తెలిపారు.

సీఎం సహాయ నిధి ఒక వరం : మంత్రి



సమిశ్రగూడెంలో చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఒక వరం లాంటిదని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం సమిశ్రగూడెంలోని ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గంలో 59 మంది లబ్ధిదారులకు రూ. 29.72 లక్షల విలువైన చెక్కులు అందించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మొత్తం 294 మందికి రూ. 2.45 కోట్ల మేర లబ్ధి లభించిందన్నారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆపదలో ఉన్న వారికి నిరంతరం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకువెళుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు తనతో పాటు ప్రజలంతా కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఫలితాల్లో జిల్లా మొదటి ర్యాంకు



వైష్ణవి హారిక

తాళ్లపూడి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో తాళ్లపూడికి చెందిన కే. వైష్ణవి హారిక స్కూల్ అసిస్టెంట్ హిందీ విభాగంలో జిల్లా మొదటి ర్యాంకు సాధించింది. కాగా ఈమె తండ్రి కొలచిన ప్రసాద్ తాళ్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. వైష్ణవి విజయం పట్ల పాఠశాల టీచర్లు, టీచర్ల సంఘాలు, తదితరులు అభినందనలు తెలిపారు.

ఇద్దరికి జాతీయ సేవా పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న కృపానంద వరప్రసాద్

నిడదవోలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యదర్శి వంగా కృపానంద వరప్రసాద్‌కు జాతీయ సేవా పురస్కారం లభించింది. ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలోని సీఆర్‌సీ ఫంక్షన్ హాలులో మదర్ థెరిస్సా ఎడ్యుకేషనల్ సొసైటీ వారు అందించారు. దివ్యాంగులకు విశేష సేవలందిస్తున్న కృపానంద వరప్రసాద్‌కు ఈ పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. దీంతో పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

పెరవలి: కానూరుకు చెందిన అమ్మ బ్లడ్ ఆర్గనైజేషన్ నిర్వాహకుడు రాముకు సెయింట్ మదర్ థెరీసా జాతీయ సేవా పురస్కారం లభించింది. ఆదివారం రావులపాలెంలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ డాక్టర్ దిడ్ల కిషోర్ సమక్షంలో అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 75 మందికి అవార్డులు అందజేశారు. అవార్డు రావడం తనకు చాలా సంతోషంగా ఉందని డాక్టర్ రాము పేర్కొన్నారు.

క్రైస్తవులకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి



ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మాట్లాడుతున్న శ్యామ్ రవిప్రకాష్

కొవ్వూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు గాను వారికోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆలిండియా క్రిస్టియన్ జేఏసీ జాతీయ కన్వీనర్ బొంతా శ్యామ్ రవిప్రకాష్ డిమాండ్ చేశారు. ఈనెల 24వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జాతీయ కోఆర్డినేటర్ మాణర్డన్ లూథర్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఇందులో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జీఎస్ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారన్నారు. అలాగే పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై క్రైస్తవులకు ఉన్న అనుమానాలను ప్రభుత్వం నివృత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మల్లెల రాజు, పార్లమెంటు సభ్యులు ఉదిత్‌రాజ్, పెరికే వరప్రసాద్, బిషప్‌లు, పాస్టర్లు పాల్గొన్నారన్నారు.

మావుళ్లమ్మకు వెండి సూత్రాల బహూకరణ



అమ్మవారికి వెండి సూత్రాలు బహూకరిస్తున్న రామకృష్ణ దంపతులు

తాళ్లపూడి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రక్కిలంకలో వేంచేసియున్న మావుళ్లమ్మ వారికి అడపా రామకృష్ణ దంపతులు ఆదివారం వెండి సూత్రాలు బహూకరించారు. కార్యక్రమంలో అడపా రామకృష్ణ, సత్యవేణి దంపతులు పాల్గొని మాట్లాడుతూ తమ కుమార్తె సత్య ప్రసన్న పుట్టినరోజును పురస్కరించుకుని వీటిని ఆలయ కమిటీ సభ్యులకు ఇవ్వడం జరిగిందన్నారు. అంతేకాకుండా మూడు నెలలకు సరిపడా ధూప దీపాల ద్రవ్యాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

22,309 స్మార్ట్ రేషన్ కార్డులు సిద్ధం

బిక్కవోలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలం మొత్తమ్మీద 22,309 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీకి సిద్ధం చేశామని తహశీల్దార్ సత్యకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్డులను గ్రామాల వారీగా సచివాలయాలకు అందజేస్తామన్నారు.

పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆదివారం చాగల్లు మండలానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. చాగల్లు మండలంలోని చాగల్లు, ఊనగట్ల, చంద్రవరం, మార్కొండపాడు, బ్రాహ్మణగూడెం, దారవరం, నందిగంపాడు గ్రామాలకు చెందిన తొమ్మిది మందికి రూ. 2,97,062 విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, ఆళ్ల హరిబాబు, ఉండవల్లి గోపాల్, మద్దిపట్ల సురేష్, చాగల్లు మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే సీఎం ధ్యేయం

● మాజీ ఎమ్మెల్యే శేషారావు



వేలివెన్నులో చెక్కును అందజేస్తున్న శేషారావు

ఉండ్రాజవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని ఆదుకోవడమే సీఎం చంద్రబాబు నాయుడు ధ్యేయమని, వారిని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. ఆదివారం వేలివెన్నులో మోర్త గ్రామానికి చెందిన కామన ఏసుదయ అనే మహిళకు ఆసుపత్రి బిల్లు నిమిత్తం మంజూరైన రూ.81,799 చెక్కును ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాచమళ్ల శ్రీనివాస్, కంటిపూడి నరేంద్ర, రామ్‌ప్రసాద్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ...

పసలపూడి గ్రామ మాజీ సర్పంచ్ కాకర్ల సుబ్బారావు భార్య విశాలాక్షి ఆదివారం మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. అలాగే ఇదే గ్రామంలో ఇటీవల మరణించిన తోట సుబ్బాయమ్మ కుటుంబాన్ని కూడా పరామర్శించారు. టీడీపీ నాయకులు బలుసు వెంకటరత్నం, బూరుగుపల్లి అచ్యుత రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో కోటసత్తెమ్మ



భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

నిడదవోలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మను ఆదివారం వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి దర్శించుకున్నారు. ఉదయం సుప్రభాతసేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితాపారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీర, మహానివేదన చేశారు. దీనిలో భాగంగా భక్తులు అమ్మవారి ప్రత్యేక, ఉచిత దర్శనాలు చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజే ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 37,560, అన్నదాన విరాళాల ద్వారా రూ. 9306, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 32,500, పూజా టికెట్లు, ఇతర టికెట్ల ద్వారా రూ. 55,830 ... మొత్తం రూ. 1,35,196 ఆదాయం లభించినట్లు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.హరిసూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.

గోదావరి తగ్గుముఖం



గోష్పాదక్షేత్రం వద్ద తగ్గిన వరద ఉధృతి

కొవ్వూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి వరద క్రమంగా తగ్గుముఖం పట్టింది. నదీ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరద పోటెత్తింది. దీంతో కొవ్వూరు గోష్పాదక్షేత్రాన్ని ముంచెత్తింది. ప్రస్తుతం తగ్గుముఖం పట్టడంతో క్షేత్రంలోని స్నానఘట్టాలు నెమ్మదిగా బయట పడుతున్నాయి. ఎగువన భద్రాచలం, దిగువన దవళేశ్వరం బ్యారేజ్‌ల వద్ద ప్రమాద హెచ్చరికలను ఉపసంహరించుకోవడంతో తీరప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. గోష్పాదక్షేత్రంలో ఎటువంటి భద్రతా చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదకర గోదావరిలోనే ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు, యాత్రికులు స్నానాలు ఆచరిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగిన తరువాత స్పందించడం కంటే ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

'రైతు శ్రేయస్సే ధ్యేయంగా సొసైటీ కృషి'



సొసైటీ అధ్యక్షుడు వెంకట ప్రసాద్ (జీవీ)

తాళ్లపూడి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సే ధ్యేయంగా సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నదేవరపేట సహకార పరపతి సంఘం అధ్యక్షుడు గొరిజాల వెంకట ప్రసాద్ (జీవీ) అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ పరంగా రైతులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన యూరియాను తమ సొసైటీ ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. అలాగే తమ సొసైటీ పరిధిలోకి వచ్చే తిరుగుడుమెట్ట, వేగేశ్వరపురం, గజ్జరం గ్రామాల రైతులకు వంతుల వారీగా యూరియాను సరఫరా చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో సొసైటీ పరిధిలో నడపబడి, ప్రస్తుతం మూతబడి ఉన్న పెట్రోల్ బంకును తిరిగి ప్రారంభించి సొసైటీ ఆర్థికాభివృద్ధికి తోడ్పడేలా ఆలోచన చేస్తున్నామని జీవీ తెలిపారు.

నేటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

కొవ్వూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): క్యూఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం నుంచి పంపిణీ చేస్తున్నట్టు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు. ఇందులో ప్రభుత్వ రాజముద్రతో పాటు కుటుంబసభ్యుల వివరాలు, క్యూఆర్ కోడ్ ముద్రించబడి ఉంటుందన్నారు. మండలానికి సంబంధించి 32,999 మంది లబ్ధిదారులకు కార్డులు వచ్చాయన్నారు. ఉదయం 10-30 గంటలకు చాగల్లు పాటిమ్మపేట రామాలయం సెంటర్, 11-30 గంటలకు తాళ్లపూడి పంచాయతీ కార్యాలయం ఎదుట ఓపెన్‌సైట్, సాయంత్రం 4-30 గంటలకు కొవ్వూరు పట్టణంలోని వాంబేకాలనీ, 5-30 గంటలకు దొమ్మేరులో కార్డులను ఎమ్మెల్యే ముప్పిడి అందిస్తారన్నారు. మిగిలిన వారికి సెప్టెంబరు 1వ తేదీ నుంచి రేషన్‌షాపుల వద్ద రేషన్‌తోపాటు సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

గణేష్ నవరాత్రులకు అనుమతులు తప్పనిసరి



ఉత్సవ కమిటీలకు నిబంధనల గోడపత్రికను అందిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

తాళ్లపూడి, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రులకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం తాళ్లపూడి రావిపాటి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉత్సవ కమిటీలు ఆన్‌లైన్‌లో కానీ ఆఫ్‌లైన్‌లో కానీ పోలీస్‌స్టేషన్ వచ్చి అనుమతి పొందాలన్నారు. అలాగే మట్టితో చేసిన విగ్రహాలను పూజించాలన్నారు. శాంతియుతంగా పండుగను జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'పరిమితి మేరకు యూరియా వినియోగించాలి'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ చైర్‌పర్సన్ రామారావు

దేవరపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వరి పంటకు అవసరం మేరకే యూరియా వాడాలని రైతులకు సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పులూరి రామారావు సూచించారు. ఆదివారం సొసైటీ కార్యాలయం వద్ద ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేవరపల్లి సొసైటీ పరిధిలోని గ్రామాలైన దేవరపల్లి, రామన్నపాలెం, కొత్తగూడెం, ధుమంతనగూడెం, సుబ్బరాయపురం, అచ్చెయ్యపాలెం, బుచ్చయ్యపాలెంకు చెందిన రైతులకు మాత్రమే యూరియా అందజేయడం జరుగుతుందని, ప్రస్తుతం సొసైటీకి 12 టన్నుల యూరియా మాత్రమే వచ్చిందని తెలిపారు. యూరియా కావాల్సిన రైతులు ఆధార్‌కార్డుతో పాటు పొలం పాసుబుక్ తీసుకురావాలన్నారు. సొసైటీ సీఈవో కల్లూరి శ్రీనివాస్ శర్మ, రైతులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేను త్వరగా పూర్తిచేయాలి : ఈవోపీఆర్డీ



తాడిపర్రులో గృహాల కొలతలు తీసుకుంటున్న సిబ్బంది

ఉండ్రాజవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వామిత్వ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఈవోపీఆర్డీ కే.ఆంజనేయశర్మ పేర్కొన్నారు. ఆదివారం తాడిపర్రులో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి గృహాల కొలతలు,సరిహద్దులు నమోదు చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ సర్వే అనంతరం గృహానికి సంబంధిచిన వివరాలతో కూడిన స్మార్ట్‌కార్డులు ప్రభుత్వం అందజేసేందుకు చర్యలు తీసుకుంటుందని వివరించారు. దీనికి గృహయజమానులు పంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముసలయ్య, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా కానూరు - ఉసులుమర్రు రోడ్డు

● వాహనదారుల ఇక్కట్లు ● పట్టించుకోని అధికారులు



రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంత



లారీ వెళ్తున్న సమయంలో ఇలా...

పెరవలి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కానూరు నుంచి ఉసులుమర్రు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పాడైపోయిన రోడ్లన్నీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరమ్మతులు చేపట్టింది. కానీ ఈ రెండు కిలోమీటర్ల మీర ఉన్న రోడ్డును అలాగే వదిలేయడంతో ప్రస్తుతం పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుపై ప్రతినిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో అయితే బస్సులు, ఆటోలు ఆ గోతుల్లో పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రాత్రి సమయంలో పలు వురు మోటారు సైక్లిస్టులు అందులో పడిపోతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువును తలపిస్తోంది. ఈ రోడ్డు గుండా లారీలు కూడా ఇష్టా నుసారంగా ప్రయాణిస్తుండడంతో దుమ్ములేచిపోతోంది. ఇకనైనా అధికారులు తక్షణమే స్పందించి తగుచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మనమంతా మట్టి వినాయకులనే పూజిద్దాం

● జనసేన పార్టీ నాయకుడు ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్



మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసాద్ కుమార్

పెరవలి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మనమంతా మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని జనసేన పార్టీ నాయకుడు ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. పెరవలిలో ఆదివారం ఇంటింటికీ వినాయక మట్టి ప్రతిమలు, వ్రతకల్పం పుస్తకాలను జనసేన పార్టీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగు రంగుల బొమ్మలతో రకరకాల పదార్థాలతో తయారు చేసిన విగ్రహాలు వల్ల నదులు, కాలువలు పర్యావరణం కలుషితమవుతుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కంటిపూడి సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు నందమూరి నారాయణరావు, మొగళ్లపు సీతారామ్, యండమణి భాస్కరరావు, కర్రి అంజి, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మట్టి వినాయకులనే పూజించాలని పర్యావరణ ప్రేమికుడు శింగం శివ తెలిపారు. ఇతను 15 సంవత్సరాలుగా పలు ఆలయాల్లో సొంతంగా ఎత్తైన వినాయక ప్రతిమలను మట్టితో తయారు చేసి బహూకరిస్తున్నారు. ఈ సంవత్సరం మూడు ఆలయాలకు ఉచితంగా ప్రతిమలు ఇస్తున్నట్టు ఆయన చెప్పారు. తాను కేవలం పర్యావరణాన్ని కాపాడండి అని ప్రజలకు తెలియచేయడానికే ఈ ప్రయత్నమని, ఈ విషయంలో తన మిత్రుడు డీవీవీ, తదితరులు ప్రేరణ ఉందన్నారు.

తెలుగు లెక్చరర్ వేణుబాబుకి ప్రతిభ అవార్డు



గుడివాడలో సీఐ రమణమ్మ చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న వేణుబాబు

నల్లజర్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కరోనా సమయం నుంచి ఇప్పటి వరకు అనాథలు ,దివ్యాంగులు, వృద్ధులకు అన్నదాన సేవా కార్యక్రమాలు చేసినందుకు గాను దూబచర్ల ఎలైట్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్న వేణుబాబుకు మదర్‌థెరీసా ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతిభ అవార్డు ఇచ్చి గౌరవించినట్టు ప్రిన్సిపాల్ కలగర శ్రీలక్ష్మి తెలిపారు. గుడివాడలో సీఐ ఇంజిరపు రమణమ్మ చేతులమీదుగా ఆదివారం అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వేణుబాబును పలువురు అభినందించారు. సొసైటీ ఫౌండర్ దిడ్ల కిషోర్‌కు వేణుబాబు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

గోపాలపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం, టాటా ఏస్ ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా, మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని సాగిపాడులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కొవ్వూరు మండలం తోగుమ్మికి చెందిన ముప్పిడి నరేశ్ (29), గుడ్డిగూడెంలో ఉన్న తన సోదరిని చూసేందుకు తన స్నేహితుడైన రాపాక బాలాకుమార్‌తో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లారు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన వ్యాన్ ఢీకొనడంతో నరేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాలైన బాలాకుమార్‌ను గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

దివాన్‌చెరువు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ - 2003 ఉపాధ్యాయులు పాతపెన్షన్ సాధనకై విజయవాడలో ఈనెల 25న (నేడు) చేయనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ సూరి జయత్రినాథబాబు విజ్ఞప్తి చేశారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం మెమో నెం. 57 ద్వారా పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డీఎస్సీ-2003 ఫోరం పక్షాన జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఫ్యాప్టో సంపూర్ణ మద్దతు ప్రకటించిందని చెప్పారు. ఉపాధ్యాయులందరూ అధిక సంఖ్యలో తరలివచ్చి ధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

'రాజధాని అమరావతిపై వైసీపీ దుష్ప్రచారం'

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిపై వైసీపీ నేతలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈమేరకు ఆదివారం ఒకప్రకటన విడుదల చేశారు. అమరావతిని లేపడానికి పొన్నూరును ముంచేశారంటూ మాజీమంత్రి అంబటి రాంబాబు చేసిన ఆరోపణలు నీటి మూటలని తేలిపోయాయని అన్నారు. ప్రకాశం బ్యారేజ్ గేట్లు పనిచేయడం లేదని, బెజవాడ మునిగిపోతుందని, కాఫర్ డ్యాం కొట్టుకుపోతుందన్నారు.

పునరావాస కేంద్రంలో 453 మందికి ఆశ్రయం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గోదావరి వరదల నేపథ్యంలో రాజమహేంద్రవరంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో 453 మందికి ఆశ్రయం కల్పించినట్టు ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ తెలిపారు. ఆదివారం ఆల్కాట్ గార్డెన్స్‌లోని మునిసిపల్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వరద బాధితుల పునరావాస కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ కేతావారి లంకకు చెందిన 81 మందికి, వెదుర్లమ్మలంకకు చెందిన 142 మందికి, గోదావరి గట్టు కింద నివాసం ఉండే 15 మందికి, గౌతమి ఘాట్ సమీపంలో ఉండే 45 మందికి, బ్రిడ్జిలంకకు చెందిన 170 మందితో కలిపి మొత్తం 172 కుటుంబాలకు చెందిన 453 మంది మత్స్యకారులకు పునరావాస కేంద్రంలో ఆశ్రయం కల్పించినట్టు పేర్కొన్నారు. వారికి అందిస్తున్న భోజన, వైద్య సదుపాయాలను పరిశీలించామని ఆర్డీవో చెప్పారు. వరదలు తగ్గుముఖం పట్టే వరకు ఆశ్రయం కల్పిస్తామన్నారు.